ఓ హెన్రీకథ

# మిస్ మార్థా ప్రేమకథ

◆ సి. రవీంద్రనాథ్ ◆

## మిస్ మార్థా మీచ్‌కు ఆలీనిలో మలుపుమీద ఒక చిన్న బేకరీ ఉంది.

మిస్ మార్థాకి సుమారు నలభై ఏళ్ళు ఉంటాయి. ఆమె వయస్సులాగానే ఆమె బ్యాంకు బాలెన్స్ కూడా రోజురోజుకీ పెరికి పెద్దదయ్యింది. బ్యాంకులో ఆమె పేరన రెండువేల డాలర్లు వున్నాయి. ఇవిగాక రెండు కట్టుడు పళ్ళు ఒక దయార్ద్ర హృదయం ఆమె ఆస్తిపాస్తులు. దేశంలో పెళ్లిళ్లు అయిపోయిన చాలా మంది మిస్‌మార్థాకన్నా గొప్పవాళ్లేమీ కారు. అయితే మిస్ మార్థాకు ఎందువల్లనో పెళ్లి కాలేదు.

గత రెండు మూడు వారాలగా తన బేకరీకి బ్రెడ్ కొనుక్కునేందుకు వస్తున్న ఓ కస్టమర్ మిస్ మార్థాను విశేషంగా ఆకర్షించాడు. అతను మధ్య వయస్కుడు. ట్రిమ్ చేసిన గడ్డంతో కళ్లజోడుతో హుందాగా కనిపిస్తాడు. జర్మన్ యాక్సెంట్‌తో ఇంగ్లీషు మాట్లాడతాడు. అతను వేసుకొనేవి అంత ఖరీదైన దుస్తులు కాకపోయినా చాలా నీట్‌గా వుంటాయి. సభ్యత సంస్కారం కల వ్యక్తిలా కనిపిస్తాడు. రోజూ ఒక విలువ వుండిన బ్రెడ్ కొంటాడు. తాజా బ్రెడ్ ఒక్కొక్కటి 5 సెంట్లు. విలువ వుండిన బ్రెడ్ 5 సెంట్లకు రెండు చొప్పున అమ్ముతుంది మిస్ మార్థా. అతనెప్పుడు విలువ వుండిన బ్రెడ్ మాత్రమే కొంటాడు.

ఒకరోజు మిస్‌మార్థా అతని వ్రేళ్లమీద ముదురు కాఫీ పొడిరంగు మరకలు చూసింది. అతను ఖచ్చితంగా బొమ్మలు వేసే కళాకారుడై వుంటాడని, అతని దుస్తులని బట్టి పేదవాడై వుంటాడని వూహించింది. అతను బహుశా రోజూ మంచి మంచి పెయింటింగ్స్ వేస్తూ బేకరీ నుంచి తీసుకొని వెళ్ళిన విలువైన బ్రెడ్‌ని తింటూ భవిష్యత్తుని గురించి బంగారు కలలు కంటూ వుండే వుంటాడని మిస్ మార్థా వూహించింది. మార్థా భోజనం చేసినప్పుడల్లా కళాకారుడైన ఆ పెద్ద మనిషి విలువ వుండిన బ్రెడ్ కాకుండా తనతోపాటు చక్కని



భోజనముచేస్తే ఎంత బాగుండి వుండేదో అనుకునేది. ఇలా ఆమె చాలా సార్లు అనుకుంది. మిస్ మార్థాది జాలి గుండె అన్న విషయం ముందే చెప్పాను గదా!

అతను కళాకారుడై వుంటాడన్నది మిస్ మార్థా వూహ. తన వూహ నిజమో కాదో తేల్చుకోటానికి మిస్ మార్థా ఒక పథకాన్ని రూపొందించింది. ఎప్పుడో ఎగ్జిబిషన్‌లో కొన్న ఒక పెయింటింగ్‌ను ఇంట్లోంచి తెచ్చి బేకరీలో గోడకు తగిలించింది. అత్యంత రమణీయంగా చిత్రీకరించిన ప్రకృతి దృశ్యమది. రెండు రోజుల తరువాత కళాకారుడైన ఆ కస్టమర్ వచ్చాడు. మామూలుగా అడిగినట్లుగానే రెండు విలువ వుండిన బ్రెడ్స్ అడిగాడు. మిస్ మార్థా రొట్టెలని కాగితంలో మడుతూవుండగా చెప్పాడతను — "మీ దగ్గర చాలా అద్భుతమైన పెయింటింగ్ వుంది మేడమ్!" అని.

◆◆◆

ఒక బేకరీ, బ్యాంకులో రెండువేల డాలర్లు, రెండు కట్టుడు పళ్ళు. ఒక దయార్ద్రహృదయం ఇవీ మిస్ మార్థాన్ ఆస్తిపాస్తులు.

◆◆◆

"ఔనా? నాకు పెయింటింగ్స్‌ని గురించి అంత బాగా తెలియదు. నిజంగా ఇది అంత మంచి పెయింటింగేనా?" ప్రశ్నించింది మిస్ మార్థా.

"ఔను! అది ప్రతిభావంతుడైన కళాకారుడు వేసిన పెయింటింగ్. చాలా అందంగా వుంది. గుడ్‌మార్నింగ్ అండ్ గుడ్‌డే మేడమ్!" అంటూ మిస్ మార్థా అందించిన రొట్టెలు తీసుకొని వెళ్ళిపోయాడతను.

అతను కళాకారుడన్న విషయం మిస్ మార్థాకు రూఢి అయిపోయింది.

అతను తెలివైన వాడు కాబట్టే కళాకారుడు కాబట్టే ఆ పెయింటింగ్ గొప్పతనాన్ని ఇట్టే పసిగట్టగలిగాడు. అంత తెలివైనవాడు పెద్ద మనిషి విలువ వుండిన రొట్టెలు తిని బ్రతకడం మిస్ మార్థాకు బాధను కలిగించింది. ప్రపంచలో ఎందరో మేధావులు గుర్తింపుని పొంది వెలుగులోకి వచ్చేవరకు ఇలా విలువ వుండిన రొట్టెలు తిన్నవారే కదా, అనుకుంది మిస్ మార్థా. ఇలాంటి మేధావికి తనలాంటి జాలిగుండెకల స్త్రీ బ్యాంక్‌లో వున్న రెండువేల డాలర్లు, రోజూ డబ్బులు సంపాదించి పెట్టే బేకరీ తోడైతే ఎంత బాగుండును అనుకొంది సీరియస్‌గా.

అతను రోజూ బేకరీకి వచ్చేవాడు. మిస్ మార్థాతో ఆనందంగా కబుర్లు చెప్పేవాడు. అయితే ఒక్కరోజు కూడా కేక్స్ గాని బేకరీలో వున్న మరొకటి గాని కొనేవాడు కాదు. రోజూ విలువ వుండిన రొట్టెలు మాత్రమే కొనేవాడు. మిస్ మార్థాకి రోజు రోజుకి అందచందాలకి మెరుగులు దిద్దుకోవటంపై ఆసక్తి ఏర్పడసాగింది. తాను ఏ దుస్తుల్లో అందంగా కనిపిస్తానని ఆమె తలిచేదో ఆ దుస్తులు ధరించేది.

రోజూలాగానే ఆ రోజు కూడా రొట్టెలకోసం వచ్చాడు అతను. ఏదో చెప్పబోయేంతలోగా రోడ్డు మీది నుంచి ఫైర్ ఇంజన్ పెద్దగా శబ్దం చేసుకొంటూ వెళ్లింది. అతను ఏం జరిగిందో చూద్దామని చటుక్కున రోడ్డుమీదకు వెళ్ళాడు. ఈ అవకాశం

# ఓ హెన్రీకథ

కోసం ఎన్నో రోజుల్నుంచి ఎదురుచూస్తున్న మార్థా ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించు కుంది. కౌంటర్ క్రింద షెల్ఫులో డైరీ నించి వచ్చిన తాజా వెన్న వుంది. మిస్ మార్థా చాకుతో రొట్టెను నాలుగైదు భాగాలుగా కోసి తాజావెన్న వుంచి గబగబ ప్యాక్ వేసింది. రోడ్డు మీదకెళ్ళిన అతను వెనక్కి తిరిగి వచ్చి డబ్బులు ఇచ్చి ఆ బ్రెడ్‌లు తీసుకొని వెళ్ళిపోయాడు. ఆ రోజు మిస్ మార్థాకి చాలా ఆనందంగా వుంది.

అతనిపై తనకుగల ప్రేమకు తన దయార్ద్ర



హృదయానికి నిదర్శనంగా తాను రొట్టెలమధ్య తాజా వెన్నె వుంచిన విషయాన్ని అతను గుర్తిస్తా డా? లేదా — బాధపడతాడా? కళాకారుడు కదా. కొంపతీసి బాధపడతాడేమో! ఇలాంటి ఆలోచనల తో సతమతమైంది మిస్ మార్థా. ఒక అరగంట ఇలా ఆలోచిస్తూనే వుంది.

మిస్ మార్థా ఆలోచనలను భగ్నం చేస్తూ హఠా త్తుగా బేకరీలోకి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు కళాకారుడు. రెండవ వ్యక్తికి ఒకపాతికేళ్ళుంటాయి. అతన్ని మిస్ మార్థా ఎప్పుడూ చూడలేదు.

కళాకారుడు మాత్రం చాలా కోపంగా వున్నాడు. అతని ముఖం ఎర్రగా వుంది. అతను రెండు గుప్పెళ్ళు బిగించి కౌంటరు మీద గుద్దుతూ జర్మన్ భాషలో గట్టిగా ఏదో అరుస్తున్నాడు. యువకుడు మాత్రం "మీరూరుకోండి నేను మాట్లాడతాను" అంటూనే కళాకారుడ్ని వెనక్కి లాగుతున్నాడు. అతను చెప్పేది ఏదీ కళాకారుడు వినిపించుకోకుండా మిస్ మార్థావైపు తిరిగి "నాశనం! అంతా నాశనం! మీవల్లే అంతా నాశనం అయింది" అంటూ అరవసాగాడు. మిస్ మార్థా బిత్తరపోయి అలాగే చూస్తూ నిలబడి పోయింది. యువకుడు కళాకారుడ్ని బలవంతంగా బయటికి లాక్కెళ్ళాడు. పదినిముషాల తరువాత యువకుడు తిరిగి వచ్చాడు.

"సారీ మేడమ్ జరిగినది మీకు చెప్పాలి" అంటూ చెప్పసాగేదు.

"మేమిద్దరం ఒకే ఆఫీసులో పనిచేస్తాము. ఆయన ఆర్కిటెక్చర్ డ్రాఫ్ట్సుమన్. గత మూడు నెలలుగా ఆయన 'న్యూసిటీ హాల్' కోసం అద్భుతమైన ప్లాను గీస్తున్నాడు. ఇది ప్రైజుకాంపిటీషన్‌కి సంబంధించినది. ఎవరి ప్లాన్ బాగుంటే వారికే వస్తుంది ప్రయిజ్. డ్రాఫ్ట్సుమన్ ముందుగా పెన్సిల్ తో ప్లాన్ గీస్తాడు. తరువాత చెరపాల్సి వచ్చినప్పుడు నిలువ వుంచిన రొట్టెముక్కతో చెరుపుతాడు. మీ దగ్గర నిలువ వుంచిన రొట్టెల క్వాలిటీ బాగుంటుంది. పెన్సిల్ లైనులు చక్కగా చెరుగుతాయి. నిన్నటికి ప్లానంతా పెన్సిల్ తో గీయడం పూర్తయ్యింది. ఈ రోజు ఆ ప్లాన్‌ని నల్లని ఇంకుతో పూర్తిచేసాడు. ఈ రోజు తీసుకెళ్ళిన నిలువ వుంచిన రొట్టెతో పెన్సిల్ లైన్‌లు చెరిపాడు. పొరపాటున మీరు రొట్టెలో వెన్నె పెట్టి ఇచ్చారు. మూడునెలలుగా ఆయనపడ్డ శ్రమంతా వృధా అయింది. ఆయన గీసిన మహాద్భుతమైన ఆ ప్లాను ఇప్పుడు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాదు. కాంపిటీషన్ ఈ రోజే. మరో ప్లాన్ గీయడానికి కూడా టైములేదు. అందుకే ఆయనంత ఆవేశ పడ్డాడు"

గుడ్లల్లో నీరుకుక్కుకుని మిస్ మార్థా అలాగే నిలబడిపోయింది. ఆ యువకుడు వెళ్లిపోయిన చాలాసేపటి వరకు మిస్‌మార్థా అలాగే నిలబడిపోయింది. మిస్ మార్థా ప్రేమకథ ఇలా ముగిసింది. ఆ తరువాత మిస్ మార్థా ఎన్నడూ ఎవర్నీ ప్రేమించే ప్రయత్నం చేయలేదు.